# మహాధనమంతే భజగోవిందం

ఎంతటివారు చెప్పినా, ఏదీ మూఢంగా నమ్మకూడదు. ఆలోచించి గానీ, ఒకరి అనుభవం చూసి కానీ నమ్మాలి.

—జయప్రద

ఉదయ భాస్కరుని తాపానికే భూమి బీటలు వారుతున్న సమయం అది.

పరిచితమైన పదధ్వనికి చదువుతున్న డైలీ పేపర్‌లోనుండి తలెత్తింది వింధ్యవాసిని. ఆఖరి మెట్లమీద తన స్నేహితురాలు కృష్ణఛాయ.

"దా కూర్చో" సోఫామీద జరిగి చోటు చూపించింది వింధ్య.

"కంగ్రాచ్యులేషన్స్. సింధూర్ ఐ. ఎ. ఎస్. కు సెలక్టు అయ్యాడట కదా!" స్నేహితురాల్ని అనుకుని కూర్చుంది కృష్ణ.

అంతవరకు ఖేదమానసానికి దర్పణంలా వున్న వింధ్యముఖంలో కొద్ది గర్వం, కొద్ది సంతోషం కలసిన హాసరేఖ.

"ఆ! నాకు నమ్మకంలేదు వచ్చేదాకా. అన్నట్టు బృందావని యం. డి. లో జాయిన్ అయిపోయిందా?"

"జాయిన్ అయిపోయింది మొన్ననే. చెపితే వింటుందా? ఏవో సంపాయించి పెట్టాంకదా! హాయిగా పెళ్ళిచేసుకోవే అంటే వినలేదు. మరలా మాలా కష్టాల్లో పడబోతుంది."

నిజంగానే నిట్టూర్చింది కృష్ణ.

"కష్టాలా? ఇప్పుడు నీకేం కష్టాలొచ్చాయట! పెళ్ళిళ్ళు అందరూ చేసుకొనేవే. బ్రతుకంటే ఓ విలువ వుండాలి."

"ఓకే. ఓకే! నువ్వన్నీ సీరియస్‌గానే తీసుకుంటావు. నేలమీద డస్ట్ దగ్గరనుండీ...." నవ్వుతూ టాపిక్ మార్చే ఉద్దేశంతో స్నేహితు రాలి చేతిలోని పేపరులోకి తొంగిచూస్తూ అడిగింది కృష్ణ.

"ఏవిటంత హాట్ న్యూస్. అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు."

'నువ్వేచూడు' తను చదువుతున్న హెడ్‌లైన్స్ వంక వేలితో చూపింది వింధ్య.

"ప్రముఖ రచయిత్రి బిందు మాధవి మీద హత్యా ప్రయత్నం. ముద్దాయితో ఇంటర్వ్యూ" తలెత్తింది కృష్ణ. "ముద్దాయితో ఇంటర్వ్యూ కూడానా? వెరీనైస్. అసలు రచయిత్రి ఏమి చేసిందట? ఆమెనెందుకు చంపాలనుకున్నాడు? నాకు చిన్నక్షరాలు కన్పించడంలేదు కాస్త చెప్పు నేనామెకు ఫేన్‌నికూడా. ఆమె చక్కటి రచయిత్రి వింధ్యా."

"వుండయితే ఇప్పుడే వస్తాను" లేచింది వింధ్య. ఆలోచిస్తూంది కృష్ణ. మనిషిని చంపాలనే ఉద్దేశ్యం మరో మనిషి కెందుకొస్తుందో! చంపిన తర్వాత ఏమి జరుగుతుంది? అని ఒక్కక్షణం ఆలోచిస్తే మనిషి తన ఆవేశాన్ని తేలిగ్గా చంపుకోవచ్చు. కాని ఆలోచించడు. ఆవేశం....ఆవేశం ఆలోచనను చంపుతూ అంతా ఆవేశం. ఎదుటి మని

షిని చంపడానికి వెనకాడని మనిషి తన ఆవేశాన్ని చంపుకోడానికి మాత్రం ఇష్టపడడు ఎంత చిత్రం!

"నన్నని నువ్వు ఆలోచనలో పడ్డావేమిటి?"

ఉలిక్కిపడి తలెత్తింది కృష్ణ. ఎదురుగా ఒక చేతిలో కాఫీ కప్పుతో మరో చేతిలో ఆంధ్రప్రభతో వింధ్య.

కాఫీకప్పు టీపాయ్‌మీద పెట్టి చేతిలో ప్రభని, చత్వారం కళ్ళ జోడుని స్నేహితురాలి కందించింది.

"ఇదెందుకు? నీ కథేమయినా పడిందా?" సంతోషంగా అందుకుంది కృష్ణ నవ్వింది వింధ్య.

"నా కథలు పబ్లిష్ అవవులే. సెక్సు కథలు, క్రైమ్ కథలు వ్రాయడం నాకు చేతకాదు."

"పోనీ ప్రేమ కథలు వ్రాయకూడదటోయ్"

"ప్రేమకథలు వ్రాసే వయసు కాదుగాని నాది. ఇందులో 'మూఢమతే--భజగోవిందం' అనే కథుంది చదువు. ఏమిటా ప్రశ్నార్థకం? రచయిత్రేం చేసిందనడిగావు కదా? దానికి జవాబందులో వుంది...."

"నా కళ్ళు...."

నవ్వుతూ కళ్ళజోడందించింది వింధ్య. "మనిద్దరికీ చత్వారమే కదా! పనికొస్తుంది చదువు. నేను గ్యాస్‌మీద కుక్కర్ పెట్టేసొస్తాను"

ఓ రచయిత్రి కథకు ఆమె మీద హత్యా ప్రయత్నానికీ సంబంధం ఏమిటో! ఆలోచిస్తూ ప్రభలో పేజీలు త్రిప్పి బిందుమాధవి కథ దగ్గర ఆగింది కృష్ణ. ఆమెకళ్ళు తన ప్రియమైన రచయిత్రిచే విరచితమైన కథలోకి తొంగి చూసాయి.

* * * *

పకపక నవ్వుతున్న భర్తవంక చిత్రంగా చూసింది తేజస్విని. ఈ మధ్యకాలంలో తన భర్త అంత హాయిగా నవ్వగా ఆమె చూడలేదు. అందులోనూ పోస్టు చూసేప్పుడు అతని ముఖంలో కనుబొమలు విసుగుతో నృత్యం చేస్తుంటాయి....పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీతో ఉద్యోగం రాక ఈ మధ్యనే బిజినెస్‌లో దిగిపోయిన యువకుడతను.

"ఎక్కడ నుండండీ ఆ ఉత్తరం"

"లవ్ లెటర్"

"నేనుండగా మీకెవరుగానీ లవ్ లెటర్ వ్రాసేది! నిజం చెప్పండి"

"చదువు" మరేం మాట్లాడకుండా నిరా మరకలైన తెల్ల కాగితాన్ని భార్య చేతిలో పెట్టాడు విపంచి.

"మీ కొచ్చిన లవ్‌లెటర్ నా కెందుకు?" చిలిపిగా నవ్వుతూ అందుకున్న తేజస్విని ముఖం ఆ ఉత్తరం చదవగానే తెల్లగా పాలిపోయింది. తన గుండె కొట్టుకునే శబ్దం తనకే విన్పిస్తుండగా చేతిలో కాగితం వణుకుతుండగా మరొక్కసారి సొంతం చదవబోయింది.

"ఏవిటోయ్ అర్థం కాలేదా?" భార్య మనో భావాన్ని గమనించని విపంచి ఆమె చేతిలో కాగితాన్ని తీసుకుని తన కామెంట్‌ని జోడించి చదవసాగాడు. "షిర్డి సాయిబాబా ప్రసన్నం-ఓం-శాంతి. ఓం శాంతి" (ఓకే) ఈ ప్రతిని మీకు మీ అదృష్టంకోసం పంపుతున్నాం (థాంక్స్) దీని మూలం జి. గోపాలంగారు, షిర్డి సాయిబాబా కృప మీ మీద వుండాలంటే ఇది మీ కందిన 96 గంటలలో ఇలాటి ముప్పయి ప్రతులను మీ సన్నిహితులైన ముప్పయి మందికి వాళ్ళ అదృష్టం కోసం పంపాలి. వెంటనే ఈ ప్రతిని చింపివేయాలి. (అలా చేయకపోతే ఏమవుతుందో!) ఇలాటి చెయిన్ ప్రపంచ మంతటా సాగుతోంది. అలా పంపిన నాలుగు రోజులలో మీ అదృష్టం బయట పడుతుంది. అలా చేసిన ఐ. ఏ. యస్.

ఆఫీసర్‌కి రెండు లక్షలొచ్చింది. మిస్టర్ యక్స్, వై, జడ్‌లు 1955లో ఇదే రీతిన ముప్పయి కాపీలు పంపి లాటరీలో డబ్బు సంపాయించారు. (డబ్బు సంపాయించడం ఇంత తేలికా? అయితే ఈ చెయిన్ ప్రారంభ మైన ముప్పయిమూడు సంవత్సరాలలో ఎన్ని లక్షలమంది కోటీశ్వరు లయ్యారో! డబ్బు చేదా అదే నిజమయితే ముప్పయి కాపీలేంఖర్మ మూడు వేల కాపీలు వ్రాస్తే పోలా!) అలా పంపడం మర్చిపోయి మిస్టర్ ఎ.బి.సి. ఉద్యోగం పోగొట్టుకుని తర్వాత పశ్చాత్తాపపడి (పాపం పూర్ ఫెలో). తిరిగి ముప్పయి కాపీలు పంపినందువల్ల కొత్త ఉద్యోగం వచ్చింది. ఉద్యోగావసరం వున్నవాడు తల తాకట్టు పెట్టయినా ఉద్యోగం సంపా యించుకుంటాడు. లంచం పెట్టకుంటే ముప్పయివేల కాపీలు వ్రాసినా అతనికి ఉద్యోగం వచ్చేందదు. అయామ్ ష్యూర్ అబౌటిట్) శ్రీమతి రజని దీనిని నమ్మనందువల్ల తొమ్మిది రోజుల్లో చనిపోయింది. (వెరీ నైస్! మంచి దయగల్ల దేవుడేనే మీ దేవుడు).

శ్రీ సాయిబాబాకి జయహూ (రాక్షస దేవుడికి జయహూ)

ఓం శాంతి (ఇంకేం శాంతి?)

పూర్తిగా చదివి ఉత్తరంలోనుండి తలెత్తిన విపంచి పశ్చాత్తాప పడ్డాడు. అప్పటికే ఆమె ముఖంనిండా స్వేద బిందువులు—ఈ ఉత్త రాన్ని ఆమెకు చూపకుంటే బాపుండేది"

"ఏవండీ?" భర్త నాస్తికత్వం ఎరిదిన తేజస్విని మరి మాట్లాడను సాహసించలేకపోయింది.

ఆ జాబును మడిచి జేబులో పెట్టుకోబోతున్న భర్త చేతిని మాత్రం గట్టిగా పట్టుకుందామె.

"ప్లీజ్! మీకు నమ్మకంలేదు నాకు తెలుసు. నాకోసం....నాకోసం వ్రాయండి లేదా నన్ను పోస్టు చేయమన్నా చేస్తాను"

విపంచి మాట్లాడలేదు. దీర్ఘంగా భార్య ముఖంలోకి చూస్తున్నాడు "ఏడేళ్ళ సాహచర్యంలోకూడా భార్యను తను మార్చుకోలేకపోయాడు"

"నాలుగు రోజుల్లో రాబోయే లాటరీ కోసం కాదండి. నన్నర్థం చేసుకోండి. మీకేమైనా అయితే...." ఆమె గొంతులో కన్నీరు"

అతను ఆమె దగ్గరగా వచ్చాడు.

ఆమె తలమీద చెయ్యి వేశాడు.

"పిచ్చి! చూడూ! ఈ జాబు నా జేబులో భద్రంగా వున్నట్టే. మరో యాభయ్ సంవత్సరాలు నా ఆరోగ్యం బావుంటే నీ కళ్ళముందే వుంటాను. నిన్ను చంపేశక్తి ఈ కాగతం ముక్కకు లేదు తేజా!

సైన్స్‌కు అందని, ముందుకు మలబద్ధ జబ్బేదయినా నాన్ను కాటేస్తే లేదా ఏ యాక్సిడెంటయినా జరిగితే తప్పు నాకేంకాదు".

"ఛీ ఏం పాడు మాటలండీ అవి" ఆగిందామె.

తనను తాను సంభాళించుకుంటూ అంది– "ఓ దస్తా కాగితాల ఖర్చు అంతేకదా!"

అతను మాట్లాడలేదు.

అతన్నలా చూస్తోంటే ఆమెలో భయం పెరిగిపోతుంది.

అప్పుడే ఓ గంట గడిచిపోయింది.

మరో తొంభయ్ ఐదు గంటల్లో వ్రాయకపోతే యింకేమయినా వుందా?

ఆమెను హఠాత్తుగా నీరసం ముంచేసింది. సోఫామీద తల వాల్చే సింది.

భార్యను చూస్తుంటే అతనికి జాలేస్తోంది.

కానీ ఆమెమీద ప్రేమకొలదీ జాలిపడి, ఆమె అమాయకత్వాన్ని ప్రోత్సహించి, తేజలాంటి మరో ముప్పయ్‌మంది అమాయకుల్లో ఇలాటి భయాన్ని పెంచదలచుకోలేదతను.

జనంలో అత్యాశను, భయాన్ని పెంచే ఇలాటి సాహసం తన భార్యను సైతం చేయనీయడు.

"తేజా!" ఆమె ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు విపంచి.

"చూడూ! నీకు దస్తా కాగితాలు తెచ్చిస్తాను. ఏ కథలో కవిత్వాలో రాసుకో. పబ్లిష్ కాకపోయినా నష్టంలేదు. రక్తి ముదిరిపోతే రామకోటి వ్రాసుకో. నీకు చేతులు నొప్పులేకాని దానివల్ల జనానికొచ్చే ప్రమాదమేమీ లేదు"

"ప్రమాదమా? ఇలాటి ఉత్తరాలు ఓ ముప్పయి వ్రాసినందువల్ల జనానికి ప్రమాదమా?" ఉక్రోషంగా అంటున్న భార్యవంక కోపంగా చూడలేదు విపంచి.

ఆమె మూఢత్వం అతనికర్థమయింది.

"ఏమీ ప్రమాదం లేదా? అయితే నువ్వు ఎందుకలా వణికిపోతున్నావు?"

"అందరూ మీలాంటి నాస్తికులే వుంటారా? ఇలా అందుకుని అలా గీని పోస్టులో పారేసి నిశ్చలంగా వుంటారుగానీ"

"అనవసరంగా ఓ పాతిక రూపాయల ఖర్చు. ఓ పేద రోగికి మంచి పనికివస్తుంది" నవ్వి లేచాడు విపంచి.

"ఎక్కడికి?" ఆత్రుతగా లేచింది తేజస్విని.

ఈ సమస్యను ఇప్పటికిప్పుడే పరిష్కరించాలనుందామెకు.

ఒక్కక్షణం వృధాచేయాలని లేదు.

"ఎక్కడికీ లేదు కూర్చో" తిరిగి తనూ కూర్చుంటూ సౌమ్యంగా అన్నాడు విపంచి.

అతడికి తన భార్య మనోస్థితి అర్థమయింది.

అలాంటి దుస్థితిలో ఆమెను వదిలి వెళ్ళడం అతని అభిమతం కాదు.

"సిగరెట్ పేకెట్ తెచ్చిస్తావా?"

"దేవుడి గురించి మాట్లాడుకుంటూ సిగరెట్ ఎందుకులెండి? మరలా తెచ్చిస్తాను" ఆమె గొంతు వణికింది.

"ఓకే! ఇలారా దగ్గరగా కూర్చో"

ఆమె ఆశగా జరిగింది.

"తేజా! నేనిపుడు అలా కాపీలు వ్రాయననుకో ఏమవుతుంది?"

నిరాశపడ్డ తేజకు ఈసారి కోపం వచ్చింది.

"ఏమవుతుందా? ఏమవుతుందో అందులో రాయలేదా? ఏదయినా ఉపద్రవం జరుగుతుందని చెప్పాలా?"

"ఎవరు కలిగిస్తారట ఆ ఉపద్రవం? మీ సాయిబాబానా?"

"ఆఁ ఆయనకు కోపంవస్తే ఏమైనా చేస్తాడు" అతని అధరాల మీద హాస్యరేఖ.

"ఎందుకు కోపం వస్తుందిట?"

ఆమె విసుగ్గా చూసింది.

"ఏవిటండీ....దేవుణ్ని నిర్లక్ష్యంచేస్తే కోపంరాదూ?"

"కోపం వస్తుందంటావా? అయితే నువ్వు నమ్మే దేవుడు మనిషి కంటే గొప్పవాడు కాదన్నమాట. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజల్ని పీడించే రాజకీయ నాయకుడన్నమాట"

అతను నవ్వుతున్నాడు.

ఆ నవ్వు వెనుక తన టెన్షన్‌ని దాచుకుంటున్నాడు, అమెకేడుపొస్తుంది. ఆమె దాన్ని దాచుకోలేదు....

ఆమె కళ్ళల్లో తడిని చూడగానే అతని హసితముద్ర మాయం అయింది.

అతను లేచాడు.

ఆమెని పొదివిపట్టుకుని. బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళి పడకమీద పడుకోబెట్టాడు.

ఆమె పక్కనే కూర్చున్నాడు.

"నేను చెప్పేమాట వింటావా తేజా! దేవుడనేవాడు వుంటే.... నేను ఎవర్నయినా హత్యచేస్తే నన్ను చంపాలి. ఎదుటి వ్యక్తి క్షోభ పెడితే నన్ను శిక్షించాలి. అంతేగాని, అతన్ని కాదన్నామని, లంచాలు ఇవ్వలేనని, వరాలు చెల్లించలేదని, దేవుడు మనల్ని శిక్షిస్తే, అలా అతన్ని మీరు చిత్రీకరిస్తే-అది మీరు అతనికి చేస్తున్న ద్రోహం తేజా! మనం మన పనులు సక్రమంగా నిర్వర్తిస్తున్నంతవరకు దేవుని ఉనికి గురించి చర్చే అనవసరం. ఏమంటావు తేజా!"

వింధ్య మాట్లాడలేదు.

అతని స్పర్శలో సేదదీరిన ఆమె మనసు నిద్రాదేవినాహ్వానించింది.

తన భార్య తనని అర్థం చేసుకుందని విపంచి మాత్రం నిశ్చింతగా వుండిపోయాడుగానీ తేజశ్వనిలో మాత్రం నిండా అశాంతి, ఏమౌతుందో! ఏమవుతుందో అనే భ్రాంతి ఆమెను వదలడంలేదు.

ఎక్కడ పెట్టాడో ఉత్తరం! ఎక్కడ వెతికినా కన్పించడంలేదు.

తను చాలా పిచ్చిపని చేసింది. అతని మనస్థత్వం తెలిసి అతనిలో వాదించాల్సింది కాదు.

ఆ ఉత్తరం కంఠతా పెట్టి ఆయన తరఫున ఆరవై కాపీలు రాసి పంపేసి వుంటే పోయేది.

బాత్‌రూమ్‌లో భర్త జేబుతో ఉత్తరం కొరకు వెతుక్కుంటూ ఆలోచిస్తున్న తేజ ఉలిక్కిపడింది.

"ఏం కావాలిరా?"

"ఏమీలేదు. కరివేపాకుకు పావలా కావల్సి వస్తేనూ!" నవ్వుతున్నాడు విపంచి.

కరివేపాకుకు పావలా తన జేబులోనుండి తీసుకోవాల్సిన దుస్థితిలో తన భార్యను తనుంచలేదు. ఈ ఇంట్లో సర్వ స్వతంత్రురాలామె. ఆమె పర్సునిండా చిల్లరుంది.

"అయితే తేజ ఇంకా మర్చిపోలేదన్నమాట ఆ ఉత్తరం గురించి" విపంచి గుండెల్లో దిగులు చిక్కబడింది.

పావలా తీసుకుని అక్కడనుండి వంటింట్లోకెళ్ళినామె అక్కడే పీటమీద కూలబడిపోయింది.

మరే పనిచేసే శక్తి అమెలోలేదు.

"అప్పుడే మూడు రోజులయింది' ఆ ఉత్తరం కన్పించడంలేదు. ఎలా? ఎలా? ఎలా.....? ఈ మూడురోజులుగా అంతకంటే మంచి ఆలోచన ఆమెకు రావడంలేదు. కూరలు సక్రమంగా కుదరడంలేదు. అన్నం సహించడంలేదు. స్నానం సహితం చేయాలన్పించదు. నిద్రపట్టదు.

తనని ఇంత మానసిక వేదనకు గురిచేసిన తన భర్తమీద కోపం వస్తుంది.

వెంటనే అతనికి తన మీదున్న ప్రేమ గుర్తొస్తుంది.

ఆయన నమ్మకం అయనది అని సమర్ధించుకుంటుంది.

తన పెళ్ళయి ఎడేళ్ళయితే అప్పుడే ఏడేళ్ళయిందా అన్పించేది.

అలాంటిది ఈ మూడురోజులు మూడు యుగాల్లా వుంది.

"అలా వున్నావేం నాన్నా!" నీరసించిన ముఖంతో బడినుండి వస్తున్న కొడుకుని చూసి భయపడుతూ ఒంటిమీద చెయ్యి వేసింది తేజశ్విని.

అభినవ్ ఒళ్ళు కాలిపోతుంది.

ఆమె గుండె జారిపోయింది.

బిడ్డకు కాస్తున్నది నూరుడిగ్రీల జ్వరమయితే తల్లి మనసు నూటః ఆరు డిగ్రీల జ్వరం.

ఇది సత్యం.

ఆ ఉత్తరాలు రాయనందువల్ల దేవుడు వేస్తున్న శిక్ష ఇది.

ఇది సత్యం....ఇది సత్యం ...

ఆమె మనసు ఘోషిస్తోంది.

ఈసారి భర్తను సమర్థించదలచుకోలేదు తేజ. నిరాహారదీక్ష పూనింది.

డాక్టర్ ఇది మామూలు జ్వరం రేపటికి తగ్గిపోతుందని హామీ ఇచ్చినా ఆమె ఊరట చెందటంలేదు.

విపంచి కోపాన్ని కూడా ఈసారి ఆమె లెక్కచేయలేదు.

కోప్పడి ఆఫీసుకెళ్ళిన విపంచికి మనశ్శాంతిలేదు.

కొడుకు ప్రక్కన ఒక్క నిమిషం కూడా శక్తిలేనట్టు పడుకున్న తేజ గాలి శబ్దమయితే ఉలిక్కిపడుతోంది.

తలుపు శబ్దమయితే ఆమె గుండె రెపరెపలాడుతోంది-ఇంకేమి దుర్వార్త వినాల్సి వస్తుందోనని.

ఈరోజు భర్త ఆఫీసునుంచి ఇంటికొస్తాడని ఆమెకు నమ్మకం లేదు.

ఈ సాయిబాబా మొదట తన కొడుక్కి జ్వరంరూపాన తన కోపాన్ని శాంపిల్ చూపాడని ఆమె నమ్మకం.

మూఢుడయిన తన భర్తకేదయిన అపాయం కల్పిస్తాడని వణికి పోతోందామె.

"తేజా" ఆఫీసుకెళ్ళి రెండు మూడు గంటలన్నా కాకుండానే తిరి గొచ్చిన భర్తను విచిత్రంగా చూసింది తేజ

అతని చేతిలో కాగితాల కట్ట.

"తేజా! లే భోంచెయ్! ఇదిగో నువ్వు వ్రాయమన్న కాగితాలు"

ఆమె ముఖంలో కోటి బల్బుల కాంతి. ఆమె శరీరంలో కొన్ని గేలన్ల శక్తి.

ఆమె గబగబా పేజీలన్నీ తిప్పింది.

తృప్తిగా కొడుకువంక చూసుకుంది.

ఇక భయంలేదు-జ్వరం తగ్గిపోతుంది.

విరక్తిగా నవ్వుకున్నాడు విపంచి.

"మాత్ర వేయకుండా చూడు తగ్గుతుందో లేదో" వ్యంగ్యంగా నవ్వుతున్న భర్తను పట్టించుకోలేదామె.

దానిపాటికది దీనిపాటికిది. రండి భోంచేద్దురుగానీ"

తృప్తిగా తింటున్న భార్యను సంతృప్తిగా చూసుకున్నాడు విపంచి.

ఓ మనసా! నువ్వెంత చిత్రమైనదానివి! శరీరంమీద నీ పాత్ర ఎంత పెద్దది?

భోంచేసి వచ్చి అరవయ్ కవర్లు తెప్పించి తెలిసినవాళ్ళ అడ్రస్‌లు అరవయ్ వ్రాసి పేపర్లు అందులో వుంచి పనమ్మాయికిచ్చింది పోస్టు చెయ్యమని తేజశ్వని.

శరీరంలోనుంచి చాలా బరువు దింపినట్లుగా వుందామెకు.

చదువుతున్న కథలోనుండి తలెత్తి స్నేహితురాలివంక చూసింది కృష్ణఛాయ

"బిందు మాధవిగారు కథ ఇలా తిప్పుతారని నేననుకోలేదు. ఫర్వాలేదే!"

కథ మధ్యలోనే కామెంట్ చేస్తున్న స్నేహితురాలిని కసిరింది వింధ్య. వాసిని మొదట పూర్తిగా చదివి మాట్లాడు.

విపంచి జేబులోంచి పదిరూపాయలనోటు పనమ్మాయి చేతిలో పడగానే ఆమె చేతిలో ఆరవయ్ కవర్లు విపంచి చేతిలోకొచ్చాయి.

ఓ యాభయ్ రూపాయలు ఖర్చయితే అయింది. తన భార్య మామూలుగా మారింది.

నిట్టూర్చాడు విపంచి.

* * * *

మరలా బుక్‌లోనుండి తలెత్తాడు కృష్ణఛాయ.

"రచయిత్రి చెప్పదల్చుకుంది సూటిగా చెప్పాలిగాని ఇలా కష్ట పెట్టడం బాగాలేదోయ్"

"పేజీ తిప్పరా బుజ్జినాన్నా ఇంకా కధ వుంది" మరలా పుస్త కంలో తలదూర్చింది కృష్ణచాయ.

* * * *

ఇదేంటి? ఈ ఉత్తరాలన్నీ ఇక్కడే వున్నాయి. సంవత్సరం రోజుల తర్వాత విపంచి కావాలని భార్యకందుబాటులో వుంచిన ఉత్తరా లన్నీ చూసి ఆశ్చర్యపోయింది తేజశ్వని.

బిల్లులేదో తయారుచేస్తున్న విపంచి తలెత్తాడు.

"సారీ తేజా! నేను వాటిని పోస్టుచేయనీయలేదు"

దెబ్బతిన్నట్టు చూస్తున్న భార్యవంక జాలిగా చూసాడు క్షణం.

"తేజా! ఈ రోజుకూడా నీకు చెప్పాలనుకోలేదు నేను. కానీ అలాటి ఉత్తరాలమీద నువ్వు పెంచుకున్న నమ్మకంనుండి మరికొన్ని ఇలాటి మూఢత్వాల్ని నమ్ముతావేమోనని భయంతో పిటసీరోజు నీ ముందుంచాను.

ఇప్పుడయినా అర్ధంచేసుకో. తొమ్మిది రోజుల్లోకాదు తొమ్మిది నెలలు నడిచినా ఏమీ కాదని. ఏం తేజా! నమ్ముతావా?"

తేజ మొదట ఆశ్చర్యపోయింది.

తర్వాత అల్లుకుపోయింది.

"సారీ సారీ అండీ"

పాపం అ అమ్మాయిని హీరో చాలా కష్టపెట్టేసాడు.

కథ చదవడం పూర్తిచేసి కృష్ణ విసిరిన జోక్‌ని జోక్‌గా తీసుకో లేదు వింధ్య.

"అంతే ఆ కథ చదివి నీకర్థమయింది అంతేనా! శరీరంలో ప్రతి భాగం ఎలా పనిచేస్తుందో తెలిసిన డాక్టర్‌ని ఆ కథలోని ప్రతి అక్షరం వెనుక రచయిత్రి అవేదన నీకర్థంకాలేదా? అనాటమీ ఫిజియాలజీ తెలిసిన మీరే దేవుణ్ని నమ్ముతున్నపుడు నీకీకథ ఇలాకాక మరెలా అర్థమౌతుంది? కానీ ఆ బుక్ ఇలా నా మొహాన పారేసి ప్రాక్టీస్ వదులుకుని నువ్వు వచ్చిన రాచకార్యమేమిటో చెప్పు"

నవ్వింది కృష్ణ

"వింధ్యా! జీవితం నవ్వడానికేగాని ఏడ్వడానికి కాదు. కథలో రచయిత్రి చెప్పదల్చుకున్నదేమిటో నాకర్థమయింది లేవోయ్-నీలా ప్రతి చిన్న విషయాన్ని గుండెలమీద ఫెవికాల్ వేసి అంటింమకోనంతే! అలా అంటించుకుంటూ పోతే ప్రాణసఖీ! గుండె సాగలేక ఆగిపోతుంది. నీ ముఖాన కాస్త నవ్వు పులుముకుని ఆ పేపరిలా పడేయ్· విందితుడి గారి సంజాయిషీ ఏమిటో చూస్తాను"

* * * *

ప్ర : ఆమెనెందుకు చంపడానికి ప్రయత్నించావు?

జ : అలాటి కధలు వ్రాసి జనాన్ని చెడపడం నా కిష్టంలేక పోయింది.

ప్ర : అంతమాత్రాన మనిషిని చంపుతారా?

జ : చంపకపోతే ఇలాటివాళ్ళవల్ల నాస్తికత్వం ప్రబలిపోతుంది.

ప్ర : నాస్తికత్వంవల్ల నష్టం ఏమిటి?

జ : "మూఢమతే భజగోవిందం" మీలాటి మూఢ మతాలున్నందు వల్లే ఇలాటి చెత్త కదలు వ్రాయగలుగుతున్నారు.

ప్ర : సరే....ఒకవేళ ఆమె చనిపోయి వుంటే నువ్వు ఉరికంబం ఎక్కుదువు.

జ : ఓ మంచి జరగాలంటే ఒక మనిషి ఆహుతి కావాల్సిందే. గాంధీ చావాలేదా?

పేపర్ నలిపి అవతల పారేసింది కృష్ణ.

"గాంధీతో పోలికట ఈ బుజ్జితండ్రికి అన్యాయంగా బలిచేయ బోయాడు ఆమెను. పర్వర్ట్!"

స్నేహితురాలు తాగిన కాఫీ కప్పు అందుకుని వంగి ప్రక్కన పెట్టింది వింధ్య. తిరిగి సర్దుకుని కూర్చుంటూ అంది.

"వాడినేమి అనకు కృష్ణా. వాడిలాటివాళ్ళు మన సమాజంలో ఇంటికిద్దరున్నారు. అందరూ పర్వర్ట్స్ అంటావా! కాదు. మన నమ్మకాలు మన మనసులకు సంకెళ్ళు వేస్తున్నంత కాలం, మన మనసు మనం చెప్పినట్టు వినదు. మనలో అనుకరణాధోరణి పోనంతవరకు—మూఢమతులు దేవుడి పేరుమీద కొల్లలుగా తయారవుతారు."

"మధ్యలో దేవుణ్ణెందుకులే అంటావు వింధ్యా"

"నేను దేవుణ్ణనడంలేదు. దేవుడుంటేకదా అనడానికి. దేవుడిమీద నమ్మకంవల్ల ప్రజలు ఏ ధోరణిలో వెళుతున్నారో చెపుతున్నానంతే."

"దేవుడు లేదనకు వింధ్యా"

నవ్వింది వింధ్య. "వున్నాడా? ఓకే! రా లోపలికెళ్ళి కూర్చొని డిస్కస్ చేసుకుందాం. నాపాయింట్స్ నాకున్నాయి."

"అయ్యబాబోయ్ నా దగ్గర జవాబులేదు"

"నాకు తెలుసు మీ దగ్గర జవాబుండదని. తమాషా ఏమంటే నాస్తికుల జవాబుని వినడానికి సైతం ఇష్టపడరు మీరు."

"నీతో వాదించలేనుగానీ ఒక్కమాట చెపుతాను. మా నమ్మకాలు మాకు మనశ్శాంతినిస్తున్నాయని నువ్వెందుకనుకోవు?"

మరలా నవ్వింది వింధ్య.

"అనుకోమంటావా? ఓకే అయితే ఇది చెప్పు. నీ ఆఖరి కొడుక్కి స్నేహాంత్ అని పేరు పెట్టుకోవాలనుకున్నావు నువ్వు. కానీ 'వ' అనే

అక్షరంలో దేవుడిపేరు కలిపి పెట్టాలన్నారు నీ జాతకాల అధికారి. చచ్చినట్టు వెంకటరమణా అని పేరు పెట్టావు. వాడినలా నీవు పిలుస్తున్నంతసేపూ బాధపడుతూనే వున్నావు. ఎందుకట? అసలిలాంటి చిన్న విషయాలకు మనసును చంపుకోవాల్సిన అవసరం ఎందుకొచ్చింది? నువ్వు చెప్పలేవులే. నేను చెపుతానువిను. పెద్దవాళ్ళ జాతకాలని ఎందుకు పెట్టారో-ఏమో అనుకరిస్తే పోయె! అనే నమ్మకంలో నుండి వచ్చింది. పదునైన మన మేధస్సును చంపుకోవడంవల్ల వచ్చింది. అంతర్లీనంగా మన రక్తంలో పారుతున్న దేవుడిమీద భక్తికాదు కృష్ణా భయం."

"అమ్మా! తల్లీ! అయిపోయిందా నీ లెక్చరు" "కాలేదు" తీవ్రంగా అని సర్దుకుని నవ్వింది వింధ్య

"ఈ రోజు నిన్ను వదలను. నువ్వు వినాల్సిందే. మీ నమ్మకాలు మీకు శాంతినిస్తున్నాయని అన్నావుగా అందుకని....చెప్పు కృష్ణా! ఈ మధ్య మూడోసారి వచ్చిన వాస్తు శాస్త్రజ్ఞుడు రెండోసారి పగలగొట్టి కట్టిన వంటిల్లు మరో జాగాలో కట్టమన్నందుకు అయిన ఇరవై వేల ఖర్చుకు ఎందుకు బాధపడ్డావట?

"ఏదోలే, బుద్ధి గడ్డితిని నీతో చెప్పుకున్నాను. ఇక నన్ను వదిలెయ్ తల్లీ వెళ్ళొస్తాను" లేచి నిల్చుంది కృష్ణఛాయ.

"ఆగాగు అసలెందుకొచ్చావో చెప్పు" "రేపు సత్యనారాయణ వ్రతం చేస్తున్నాను. బుద్ధి తక్కువై నిన్ను పిలవడానికొచ్చాను.... బాబోయ్ మరో లెక్చరివ్వకు వెళ్ళొస్తాను" రెండుమెట్లు దిగేసింది కృష్ణ.

"ఎప్పుడు వ్రతం?"

"వస్తావా?" ఆశ్చర్యంగా చూసింది కృష్ణ. "వస్తాను నువ్వు సత్యనారాయణ వ్రతం చేయకపోతే నా కిష్టమే. కానీ చేసినందువల్ల నీకు నష్టమేమీ లేదు. ఖర్చుపెట్టుకోగల స్థోమత నీకుంది" ఆగింది వింధ్య. "కానీ కృష్ణా దేన్నయినా కొలవాలనుకుంటే దైవత్వాన్ని కొలవండి. మూఢత్వాన్ని మాత్రం కొలవకండిప్లీ.జ్"